సాక్షి అనంతపురం

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



టీడీపీ నేత దౌర్జన్యం

సొంత స్థలంలో సీసీ రోడ్డు ఎలా వేస్తారంటూ ప్రశ్నించినందుకు ఓ టీడీపీ నేత రెచ్చిపోయి భౌతిక దాడికి దిగాడు. 8లో



టమాట కిలో రూ.77

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.77, కనిష్టంగా రూ.51, సరాసరిన రూ.67 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

36.8°/22.9°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



బుక్కరాయసముద్రం: ఈ క్రాప్ వివరాలు పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

రాప్తాడు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ పంటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించేందుకు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పంటకు ఏ మందులు వాడాలో అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, డీహెచ్‌ఓ నరసింహ రావు, డీఎస్‌ఏ ఆంజనేయులు, హార్టికల్చర్ జేడీ దేవముని రెడ్డి, హెచ్‌ఓ రత్నకుమార్, ఏడీఏ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌తో అనేక లాభాలు

బుక్కరాయసముద్రం: ఈ క్రాప్ చేయించుకుంటే రైతులకు అనేక లాభాలు చేకూరతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పసులూరు, భద్రంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో ఈ క్రాప్ చేసిన పంట పొలాలను పరిశీలించారు. మండలంలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు అనే వివరాలను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ ఉంటేనే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ పరిహారం అందుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్ రెడ్డి, ఉద్యాన సహాయకుడు మునికుమార్, నేత్రావతి, జ్యోత్స్న రైతులు పాల్గొన్నారు.

7 వరకు ఈ-కేవైసీకి అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఈ-క్రాప్‌నకు సంబంధించి ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 7 వరకు అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. ఇప్పటికే 96 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగతా 4 శాతం రెండు మూడు రోజుల్లో పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ లాంటి ప్రయోజనాలు వర్తించవన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుండగుల దుశ్చర్య

- కూడేరు మండలం కమ్మూరులో ప్రభుత్వ భవనాల శిలాఫలకాలు ధ్వంసం



కమ్మూరు సచివాలయ భవనం ముందున్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని కమ్మూరులో దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. గ్రామంలోని సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రం భవనాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. గురువారం ఉదయం విధులకు హాజరైన ఆయా కార్యాలయాల ఉద్యోగులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్‌ఐ రామానాయుడు, సిబ్బంది వచ్చి ధ్వంసమైన శిలాఫలకాలను పరిశీలించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



గుంతకల్లులో బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో వాసవీమాత

అమ్మ పండుగ.. ఇక ఆనందమే నిండుగా..



అనంతపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు విద్యుద్దీప కాంతుల నడుమ కొత్త శోభ సంతరించుకున్నాయి. మొదటి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని 9 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక పరిమళం వెల్లివిరియనుంది. – సాక్షి బృందం



అనంతపురం కొత్తూరు అమ్మవారి శాలలో దేవతామూర్తులు

అక్రమాల ప్లానింగ్

- అనంతపురం నగరంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- అనుమతులు ఒకలా పొంది, నిర్మాణాలు మరోలా సాగిస్తున్న వైనం
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ముడుపులు ముట్టడంతోనే నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు



- ఇది అనంతపురం నగరంలోని రహమత్‌నగర్ పోలీసు పెట్రోల్ బంకు ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కమర్షియల్ భవనం. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల సాయంతో నిర్మాణదారుడు ఒక ఫ్లోర్ అదనంగా వేసినా ఇంత వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ భవనానికి చార్జ్‌షీట్ దాఖలు చేయలేదు.



- అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో వెలసిన అనధికార భవనమిది. నిర్మాణదారుడు జీప్లస్ 4, స్టిల్ట్ పేరుతో నగరపాలక సంస్థకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అనుమతులు రాకున్నా జీప్లస్ 5 భవనం నిర్మించేశారు. ఇంత వరకు నగరపాలక సంస్థ అధికారులు ఈ భవనంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చార్జ్‌షీట్ దాఖలు చేయలేదు. ఈ నిర్మాణంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు అందినట్లు సమాచారం.

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అనుమతులు ఒకలా తీసుకోవడం, నిర్మాణం మరోలా చేపట్టడం భవన నిర్మాణదారులకు పరిపాటిగా మారిపోయింది. టౌన్ ప్లానింగ్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భవిష్యత్తులో ప్రమాదాలే..

అనంతపురం నగరం రోజు రోజుకూ విస్తరించడం, జనాభా పెరిగిపోవడంతో భారీ వ్యాపార సముదాయాలకు కేంద్రంగా నిలుస్తోంది. ఈ క్రమంలో కమలానగర్, రామ్‌నగర్, శ్రీనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు, ఆదర్శనగర్, సుభాష్ రోడ్డు, రాజు రోడ్డు, 3,4,5 రోడ్లు, ప్రశాంతి నగర్, జనశక్తినగర్, సాయినగర్, సూర్యనగర్, జీసస్‌నగర్, విద్యుత్‌నగర్, కోర్టు రోడ్డు, గుల్జార్‌పేట, ఆదిమూర్తినగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో భారీగా అనధికార నిర్మాణాలు వెలిశాయి. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న నిర్మాణాల్లో ఒక్క చోట కూడా నిబంధనలను పాటించడం లేదు. శ్రీనగర్ కాలనీలో నీరు–ప్రగతి వనం వెనుక వైపు నిర్మిస్తున్న ఓ భవనానికి అసలు సెట్‌బ్యాక్స్ వదల్లేదు. కమలానగర్‌లో ఓ మార్కెటింగ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారు. అనుమతులు లేకుండా సెల్లార్లు వేశారు. రాజు రోడ్డు, కమలానగర్ డీసీఎంఎస్ రోడ్డు, సుభాష్ రోడ్డులో అనుమతి లేకున్నా సెల్లార్ల నిర్మాణాలు చేపట్టారు. నేడు అధికారుల నిర్వాకం కారణంగా భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి లేకపోలేదు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదముంది.

200 భవనాలకు చార్జ్‌షీట్లు..

నగరంలో 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో దాదాపు 200 అక్రమ భవనాలకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దాదాపు రూ.వంద కోట్ల అపరాధ రుసుం విధించారు. వాస్తవంగా నిర్మాణం జరిగే సమయంలోనే అడ్డుకట్ట వేయాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల కనుసన్నల్లో పట్టణ ప్రణాళిక కార్యదర్శులు కేవలం నోటీసులు జారీ చేయడం, భవన నిర్మాణదారులు దారికొచ్చి డీల్ కుదుర్చుకున్నాక అటువైపు తొంగి చూడకపోవడం షరామామూలుగా మారిపోయింది. 'మేం కేవలం చార్జ్‌షీట్ దాఖలు చేస్తాం, మీ ఇష్టమొచ్చినట్లు నిర్మాణం సాగించుకోండి' అంటూ భవన నిర్మాణదారులకు టౌన్ ప్లానింగ్ అధికారులే భరోసా ఇస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, భవన నిర్మాణదారుల నుంచి రూ.100 కోట్ల అపరాధ రుసుం వసూలు చేస్తే నగరాభివృద్ధికి చేయూతగా ఉంటుందని నగరపాలక సంస్థ సిబ్బంది అంటున్నారు. కానీ ఉన్నతాధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

అనధికార నిర్మాణాలే కన్పిస్తున్నాయా?



అనధికార నిర్మాణాలు మాత్రమే కన్పిస్తున్నాయా? నగరంలో ఇంకా చాలా సమస్యలున్నాయి. ప్రజల్లో మార్పు రాకపోతే టౌన్ ప్లానింగ్ విభాగం ఏం చేస్తుంది. ప్రజలు సైతం నిబంధనలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిబంధనలను అతిక్రమిస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చార్జ్‌షీట్ దాఖలు చేసిన భవనాల నుంచి అపరాధ రుసుం వసూలు చేయించేలా చర్యలు చేపడతాం.

– నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

నగరపాలక సంస్థ వివరాలు..

మొత్తం డివిజన్లు	50
సచివాలయాలు	74
ప్రస్తుతం నగరంలో అనధికార నిర్మాణాల సంఖ్య	100 పైమాటే
చార్జ్‌షీట్ దాఖలు చేసిన భవనాల సంఖ్య	200
విధించిన అపరాధ రుసుం	రూ.100 కోట్లు



కమలానగర్‌లో అనధికారికంగా సెల్లార్‌తో నిర్మిస్తున్న భారీ భవనం



శ్రీనగర్ కాలనీ నీరు-ప్రగతి వనం పక్కన సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మించిన భారీ భవనం

సికింద్రాబాద్ - వాస్కోడిగామా మధ్య ప్రత్యేక రైళ్లు

- 6,9,10వ తేదీల్లో రాకపోకలు
- దసరా నేపథ్యంలో ఏర్పాటు



గుంతకల్లు: దసరా సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 6,9,10వ తేదీల్లో సికింద్రాబాద్–వాస్కోడిగామా వయా గుంతకల్లు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6న ఆదివారం ఉదయం 11.45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో రైలు (07039) బయలుదేరి కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్ మీదుగా గుంతకల్లుకు సాయంత్రం 6.15 గంటలకు చేరుతుంది. గుంతకల్లు జంక్షన్‌లో 6.25 గంటలకు బయలుదేరి బళ్లారి, హొస్పేట్, కొప్పల్, గదగ్, హుబ్లీ మీదుగా వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చేరుతుంది. అదేవిధంగా మరో రైలు (07039) 9వ తేదీ బుధవారం ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు సాయంత్రం 4.50 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5.05 గంటలకు బయలుదేరి వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు చేరుతుంది. తిరిగి 10వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు వాస్కోడిగామాలో (07040) ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 8.55 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన పంటలు సాగు చేయాలి

- రైతులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



'అనంత మిత్ర' కార్యక్రమంలో రైతుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక ఆల్ ఇండియా రేడియోలో నిర్వహించిన 'అనంత మిత్ర' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి దాదాపు 13 మంది రైతులు ఫోన్ చేసి తమ సమస్యలు, సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ఆయన నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నెలలో మొదటి, మూడో గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.15 గంటల వరకు 30 నిమిషాలు పాటు 'అనంత మిత్ర' ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అందులో భాగంగా ఉద్యాన పంటల సాగుపై గురువారం అవగాహన కల్పించామన్నారు. రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమ అనుసంధానకర్తగా ఆకాశవాణి డైరెక్టర్ జి.నాగేశ్వరరావు వ్యవహించారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఏపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్, రాప్తాడు ఉద్యానాధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.

5 లోపు ఫ్రీహోల్డ్ పరిశీలన పూర్తిచేయాలి

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పరిశీలన ప్రక్రియ ఈనెల 5వ తేదీలోపు పూర్తి చేసి రిపోర్టులు అందజేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34,485 ఎకరాల భూమికి సంబంధించి ఫ్రీహోల్డ్ పరిశీలన పూర్తి చేయాలని చెప్పారు. అసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ అయ్యి రిజిస్ట్రేషన్ జరిగిన 178.73 ఎకరాల భూమికి సంబంధించి పునః పరిశీలన జరిగిందని, మిగతాది కూడా గడువులోపు పూర్తి చేయాలన్నారు. కుందుర్పి, పామిడి మండలాలు వెనుకబడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే జాయిన్ కావాలని ఆదేశించారు. వ్యక్తిగత, అనారోగ్య కారణాలకు సంబంధించి ఉద్యోగులు ఇచ్చిన అర్జీలను పరిశీలించాకే ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీ చేశామన్నారు. ఇక ఎలాంటి మార్పులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- రేపు 'పీఎం కిసాన్' రూ.2 వేలు విడుదల
- 'అన్నదాత సుఖీభవ' సాయంపై తేల్చని కూటమి ప్రభుత్వం

అనంతపురం అగ్రికల్చర్: పంట పెట్టుబడి సాయం కింద శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2 వేలు విడుదల చేయనుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది రెండో విడతగా (మొత్తంగా 18వ విడత) సాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో అర్హత కలిగిన 2,79,161 మంది రైతుల ఖాతాల్లోకి రూ.55.83 కోట్ల పెట్టుబడి సాయం నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. తొలివిడతగా గత జూన్ 18న 2,76,147 మంది రైతులకు రూ.55.23 కోట్లు ఇచ్చారన్నారు.

బాబూ రైతులు గుర్తున్నారా..?

అన్నదాతకు సాయం చేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఎటూ తేల్చడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెబుతూ 'సూపర్ సిక్స్'తో ఎన్నికల ముందు అదరగొట్టిన చంద్రబాబు.. తీరా అధికారం చేపట్టగానే దాని ఊసే ఎత్తడం లేదు. 'అన్నదాత సుఖీభవ' అంటూ పథకం పేరుమార్చి రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు.? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోనూ మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయకుండా అన్నదాతలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు సర్కారు నిర్లక్ష్య వైఖరిని రైతులు, రైతు సంఘాల నాయకులు, విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

రైతు కష్టనష్టాల్లో వైఎస్ జగన్..

గత ఐదేళ్లు సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కరోనా వంటి అత్యంత విపత్కర పరిస్థితుల్లో సైతం రైతు కష్టనష్టాల్లో అండగా నిలబడ్డారు. ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 ప్రకారం జమ చేశారు. కౌలురైతులు, దేవదాయ, అటవీభూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి పెట్టుబడి సాయం అందించారు. గత ఐదేళ్ల కాలంలో ఒక్కో రైతు ఖాతాలో రూ.67,500 మేర జమ చేశారు. ఏటా సగటున 2.86 లక్షల మంది రైతులకు రూ.1,936.67 కోట్లు అందించి భరోసా కల్పించారు.

తొలిరోజు టెట్ ప్రశాంతం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. తొలిరోజు 277 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లోనూ మొత్తం 2,310 మంది అభ్యర్థులకు గాను 2,033 మంది హాజరయ్యారు. ఉదయం విడత పరీక్షకు 1,235 మందికి గాను 1,070 మంది హాజరయ్యారు. 165 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం విడత పరీక్షకు 1,075 మందికి గాను 963 మంది హాజరయ్యారు. 112 మంది గైర్హాజరయ్యారు.



అనంతపురంలోని ఓ సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం



వన్నూరుస్వామి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బ్రహ్మసముద్రం : అప్పులు తీర్చే మార్గం కాన రాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన వన్నూరుస్వామికి (28)కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న వన్నూరు స్వామి గత ఏడేళ్లగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. వైద్య చికిత్సకు, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.2 లక్షలకు పైగా చేరుకున్నాయి. అయినా జబ్బు నయం కాలేదు. ఈ క్రమంలో శరీరంలో శక్తి సన్నగిల్లడంతో ఏ పనీ చేసుకోలేని అసహాయ స్థితికి చేరుకున్నాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియని అయోమయ స్థితిలో జీవితంపై విరక్తి పెంచుకున్న వన్నూరుస్వామి... బుధవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపులపై ఎట్టకేలకు కేసు నమోదు

బొమ్మనహాళ్: తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ మహిళ వేడుకోలును పోలీసులు పెడచెవిన పెట్టారు. ఈ విషయం కాస్త బహిర్గతం కావడంతో చివరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వివరాలు... బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామంలో 40 ఏళ్ల వయసున్న మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైగింక వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో చివరకు బెదిరింపులకు దిగాడు. దీంతో వారం రోజుల క్రితం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు వ్యక్తి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని వేడుకుంది. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ అంశంలో కేసు నమోదుకు పోలీసులు వెనుకంజ వేసినట్లు తెలిసింది. ఇది కాస్త బహిర్గతం కావడంతో చివరకు గురువారం కేసు నమోదు చేసినట్లుగా సమాచారం.

వేర్వేరు ప్రాంతాల్లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె/శింగనమల: శింగనమల నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇసుక ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేశారు. గార్లదిన్నె మండలం కొప్పలకొండ సమీపంలోని పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశారు. అలాగే శింగనమల మండలం పెద్ద జలాలపురం వంక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున పోలీసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

దెబ్బకు అడవి పందులు పరార్!

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు వినూత్న మార్గలను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద వేరుశనగ పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ చీరలతో ఓ రైతు కంచె ఏర్పాటు చేశాడు. మరో రైతు డబ్బా రేకులు, సీసాలు, ప్లేట్లు వేలాడదీశాడు. గాలి వీచిన ప్రతిసారీ ప్లేటు అటు ఇటూ ఊగుతూ డబ్బా రేకులు, గాజు సీసాలకు తగలడం ద్వారా ఉత్పన్నమైన శబ్దానికి పందులు పొలం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల మరి కొందరు రైతులు తమ పొలాల్లో గాజు సీసాలు, ప్లేట్లు వేలాడదీసి అడవి పందులను బెంబేలెత్తించి పంటను కాపాడుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మామిళ్లపల్లి సమీపంలో వేరుశనగ పంట పొలం చుట్టూ కట్టిన చీరలు



గాలికి ఊగుతూ శబ్దం చేస్తున్న ప్లేటు, గాజు సీసా



వేలాడదీసిన డబ్బా రేకు

డీఈఓల స్థానాల మార్పునకూ 'రాజకీయం'

- ప్రజాప్రతినిధులతో అధికారులకు చెప్పిస్తున్న వైనం



డేటా ఎంట్రీ ఆపరేటర్లు (ఫైల్)

అనంతపురం అర్బన్: జిల్లా ఎన్నికల విభాగం ద్వారా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ల (డీఈఓ) స్థానాల మార్పుల్లోనూ రాజకీయ ఒత్తిళ్లు తప్పడం లేదు. జిల్లావ్యాప్తంగా ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాలు, నగర, పుర పాలక సంఘాల్లో 51 మంది డీఈఓలు పనిచేస్తున్నారు. వీరికి బదిలీలు ఉండవు. ఎక్కడైనా డీఈఓ పనితీరుపై ఫిర్యాదు వస్తే వేరే చోటుకు మార్పు చేస్తారు. లేదా పరస్పర (మ్యూచువల్) అంగీకారంతో వస్తే స్థానాలను మార్పు చేస్తారు. అంతే తప్ప ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వీరికి బదిలీలు నిర్వహించరు. దీంతో కొందరు రాజకీయ అండ చూసుకుని అనధికార బదిలీ ద్వారా తాము కోరుకున్న మండలాలు, ఆదాయం మార్గాలున్న చోటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పరస్పర బదిలీ (మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్)కి అంగీకారం తెలపాలంటూ తోటి వారిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులతో సిఫారసు చేయించుకుంటూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకెళ్లినట్లుగా ఆరోపణలున్నాయి. దీంతో ఆందోళనకు గురైన పలువురు డీఈఓలు... స్థానాల మార్పు అంశంలో అందరికీ న్యాయం జరిగేలా చూడాలని అధికారులను పలువురు డీఈఓలు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో ఇంజక్షన్ వికటించి రోగి మృతి

- నర్సు కాకుండా ఆమె భర్త సూది మందు వేశాడన్న బంధువులు
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే ప్రాణాలు బలిగొందంటూ ఆందోళన
- మద్దతు పలికిన ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు





ఆందోళన కారులతో చర్చిస్తున్న సీఐ కౌలుట్లయ్య (ఇన్‌సెట్‌లో) మృతుడు కుళ్లాయప్ప

నార్పల: స్థానిక పీహెచ్‌సీలో సూది మందు వికటించి ఓ రోగి మృతి చెందాడు. ఘటనపై బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. వివరాలు... గురువారం వేకువ జామున తీవ్ర అస్వస్థతకు లోనైన నార్పలలోని బేల్దారీ కాలలో నివాసముంటున్న కుళ్లాయప్ప (38)ను కుటుంబసభ్యులు వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో అక్కడ స్టాఫ్ నర్సుతో పాటు ఆమె భర్త ఉన్నారు. పరీక్షించిన అనంతరం సూది మందు వేసిన కాసేపటికి పరిస్థితి విషమించి కుళ్లాయప్ప మృతి చెందాడు. డ్యూటీలో ఉన్న నర్సు కాకుండా ఆమె భర్త (వైద్య చికిత్సలపై ఎలాంటి అవగాహన లేని వ్యక్తి) ఇంజక్షన్ వేయడంతోనే కుళ్లాయప్ప మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు, బంధువులు గురువారం ఉదయం ఆస్పత్రి ఎదుట మృతదేహంతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు అక్కడకు చేరుకుని ఆందోళనకు మద్దతు తెలిపారు. అయితే ఈ అంశంపై స్టాఫ్ నర్సు హర్షిత మాట్లాడుతూ... కుళ్లాయప్పకు తానే ఇంజక్షన్ వేశానని, తనకు ఆరోగ్యం బాగాలేకపోతే తోడుగా భర్త వచ్చాడని తెలిపారు. తన భర్త ఇంజక్షన్ వేశాడంటూ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఖండించారు. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. కుళ్లాయప్ప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు. అనంతరం కుళ్లాయప్ప భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పుల్లప్ప, సీపీఐ నేత గంగాధర్ పాల్గొన్నారు.

టీడీపీ నేత దౌర్జన్యం



రంగానాయక్ తలకు కుట్లు వేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సొంత స్థలంలో సీసీ రోడ్డు ఎలా వేస్తారంటూ ప్రశ్నించినందుకు ఓ టీడీపీ నేత రెచ్చిపోయి భౌతిక దాడికి దిగాడు. బాధితులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం పులగుట్టపల్లి తండాకు చెందిన రంగానాయక్‌కు పూర్వీకుల నుంచి గ్రామంలో కొంత స్థలం సంక్రమించింది. ఆ స్థలంలో ఓ ఇల్లు కట్టుకుని మరికొంత స్థలాన్ని ఖాళీగా ఉంచాడు. ఈ క్రమంలో గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో 120 మీటర్ల మేర సీసీ రోడ్డు మంజూరైంది. ఈ పనిని స్థానిక టీడీపీ నేత మీటూ నాయక్ దక్కించుకుని తన ఇంటి ఎదుట రోడ్డు వేయించుకునేలా సన్నాహాలు చేపట్టాడు. ఈ క్రమంలో చేపట్టే పనికి సంబంధించి మార్కింగ్ ఇచ్చేందుకు గురువారం ఉదయం ఇంజనీరింగ్ శాఖ అధికారులు, సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని, కొలతలు తీయడం మొదలు పెట్టారు. అయితే రోడ్డు తన సొంత స్థలం మీదుగా వేసేలా మార్క్ చేయడంతో రంగానాయక్ అడ్డు చెప్పాడు. అదే సమయంలో మీటూ నాయక్ జోక్యం చేసుకుని ఆ స్థలం తనదంటూ దౌర్జన్యానికి దిగాడు. దీంతో తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తికి సంబంధించిన పత్రాలను అధికారులకు రంగానాయక్ చూపించాడు. అంతేకాక మీటూ నాయక్ కట్టుకున్న ఇల్లు కూడా తమదేనని, తమ తాతల కాలంలో బతుకు తెరువు కోసం వచ్చిన మీటూనాయక్ తాతకు తన తాతనే ఆ స్థలాన్ని కేటాయించాడని పేర్కొంటూ ఇందుకు సంబంధించిన రికార్డులనూ చూపించాడు. స్థలం పత్రాలన్నింటినీ పరిశీలించిన అధికారులు సీసీరోడ్డు వేయదలచిన స్థలం పూర్తిగా రంగానాయక్ కుటుంబానికి చెందినదేనని నిర్ధారించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మీటూనాయక్, ఆయన సోదరుడు భాస్కర్ నాయక్, వారి కుటుంబ సభ్యులు ఏకమై రంగానాయక్, ఆయన భార్య మీన, తమ్ముడు చిన్న రంగానాయక్‌పై విచక్షణారహితంగా కొట్టారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రంగానాయక్‌ను కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

విద్యతోనే పేదరికం దూరం

- ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ నాగలింగారెడ్డి



అధ్యాపకులతో చర్చిస్తున్న ఆర్జేడీ నాగలింగారెడ్డి

రాయదుర్గం: విద్యతోనే పేదరికం దూరమవుతుందని విద్యార్థులకు ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ నాగలింగారెడ్డి సూచించారు. రాయదుర్గం మండలం ఉడేగోళం సమీపంలో ఉన్న కేటీఎస్ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ... సమస్యలపై ఆరా తీశారు. విలువైన సమయాన్ని వృధా చేసుకోరాదని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూసుకోవాలన్నారు. బోధన, అభ్యసన, డిజిటల్ ఏ బీ సీ, జాబ్ పోర్టల్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్, తదితర అంశాలపై చర్చించారు. ఉన్నత విద్యాశాఖ కమిషన్ అమలులోకి తెచ్చిన సీఐఏ పద్ధతిపై అవగాహన కల్పించారు. అంతర్గత పరీక్షల మార్కుల నమోదు అంశంలో విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ వచ్చేలా సమష్టి కృషి చేయాలని ఆదేశించారు.

కన్నతల్లిపై హత్యాయత్నం

- రక్షించాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



కుమారుడి చేతిలో గాయపడిన నాగవేణి

విడపనకల్లు: కన్న కొడుకే తన పాలిట కాలయముడయ్యాడంటూ ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన నాగవేణి, వీరభద్రయ్య దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు అశోక్ చక్రవర్తి ఉన్నాడు. కుమార్తెకు పెళ్లి చేసి అత్తింటికి పంపారు. 11 సంవత్సరాల క్రితం వీరభద్రయ్య మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడి బాగోగులను తల్లి చూసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసైన అశోక్ చక్రవర్తి తన జల్సాలు తీర్చుకునేందుకు తరచూ డబ్బు కోసం తల్లిని చిత్ర హింసలకు గురి చేస్తూ వచ్చాడు. 22 ఎకరాల పొలం, ఇల్లును దౌర్జన్యంగా తన పేరును రాయించుకున్న అనంతరం ఆమెపై మరింత వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. గురువారం సాయంత్రం తల్లిపై విచక్షణారహితంగా దాడి చేసిన అశోక్‌చక్రవర్తి... ఆమె చేతిని కిటికీ కడ్డీల మధ్య పెట్టి లాగి విరిచాడు. అనంతరం మణికట్టుపై కోసి హత్యాయత్నం చేశాడు. కుమారుడి దాడి నుంచి ప్రాణాలతో తప్పించుకున్న నాగవేణి నేరుగా పాల్తూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రక్షణ కోరింది. తన కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని, తనను రక్షించాలని వేడుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్షతగాత్రురాలిని ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

కష్టార్జితానికి 'రక్షణ'

- వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లకు పడుతున్న తాళం
- కుటుంబ సభ్యులతో కలసి టూర్ ప్లాన్
- అప్రమత్తంగా లేకపోతే చోరీలకు ఆస్కారమంటున్న పోలీసులు
- ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలంటూ పిలుపు

అనంతపురం: దసరా నేపథ్యంలో పాఠశాలలకు వరుస సెలవులు వచ్చేశాయ్. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులంతా కలసి టూర్ ప్లాన్‌లో నిమగ్నమయ్యారు. సెలవులతో పాటు బంధువుల ఇంట శుభకార్యాల్లో పాల్గొనేందుకు చాలా మంది ఇళ్లకు తాళం బయట ఊర్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే దొంగలు చొరబడి ఉన్నదంతా ఊడ్చుకెళ్లే ప్రమాదముంది. ఇలాంటి తరుణంలో ఉచితంగా మన ఇంటిపై ఓ కన్నేసి ఉంచడానికి పోలీసు వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్)ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పండుగలు, శుభకార్యాలు, విహారయాత్రలు, తదితర అంశాల్లో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ కలిసి బయటకు వెళ్లే సమయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలి. ఇంటి దస్తావేజులు, నగదును బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవడం ఉత్తమం. ఊరెళ్తున్న విషయాన్ని ఇంటి చుట్టుపక్కల వారికి ముందే తెలపాలి. ఎప్పుడు వెళ్లేది.. ఎప్పుడు తిరిగి వచ్చేది కూడా తెలియపడం ద్వారా తాళం వేసిన ఇంటిపై వారు కూడా ఓ నిఘా వేసి ఉంచుతారు. అవకాశం ఉంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి వెనుక వైపు, ప్రధాన ద్వారాలకు సెంటర్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ఎంతో ఉత్తమం.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఎంతో ఉపయుక్తం

తాళం వేసిన ఇళ్లకు రక్షణ కల్పించేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్‌లో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను మన స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం ఊరు వెళ్లే సమయంలో రిక్వెస్ట్ పంపాలి. వెంటనే పోలీసులు ఇంటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం కమాండ్ కంట్రోల్ నుంచి పరిశీలిస్తుంటారు. ఎవరైనా చోరీకి ప్రయత్నిస్తే నిమిషాల వ్యవధిలోనే అరెస్ట్ చేస్తారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి మీ వివరాలు, చిరునామా, సెల్ నంబరూ వివరాలకు సంబంధించిన దరఖాస్తును భర్తీ చేస్తే పోలీసు వారు రిజిస్ట్రేషన్ యూనిక్ ఐడీని జనరేట్ చేస్తారు. ఫలానా రోజుల్లో ఊరు వెళ్తున్నామని పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అప్పుడు ఇంటికి వచ్చి వైర్లెస్ మోషన్ కెమెరా ఏర్పాటు చేసి వెళతారు. ఈ కెమెరా పోలీసు కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉంటుంది.



జియో ట్యాగ్‌తో మరింత రక్షణ

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌తో పాటు లాక్డ్ హౌస్ సర్వెలైన్స్ సిస్టమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. తద్వారా సమాచారం ఇవ్వకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని జియో ట్యాగ్ చేసి నిరంతరం సిబ్బంది పహారా కాసేలా చర్యలు తీసుకున్నాం. అటు వైపు అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలు పసిగట్టే పరిజ్ఞానం జియో ట్యాగ్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చాం. –పి. జగదీష్, ఎస్పీ

ఈ నెమలి.. మన నెచ్చెలి



ఇంటి ప్రహరీపై కూర్చొని ఫొటోలకు ఫోజులిస్తున్న దృశ్యం

ఎప్పుడు అడవిలో తిరిగి చెట్లు... పుట్టలంటే బోర్ కొట్టింది... ఏమో ఆ నెమలికి! అలా ఊరు చూద్దామనుకుని గురువారం ఆత్మకూరు మండలం సింగంపల్లిలో వాలింది. జాతీయ పక్షిని చూడగానే గ్రామస్తులు ఒక్కసారిగా సంబరపడిపోయారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసేందుకు ప్రయత్నిస్తుంటే... వెంటనే చెట్టుపై నుంచి ఇంటి ప్రహరీపైకి వాలి ఫొటోలకు ఫోజులిచ్చింది. అతి సమీపంలోకి వచ్చిన చిన్నారులను చూసి ముచ్చటపడింది కాబోలు.... తాను అందరి నెచ్చెలినేనంటూ సరదాగా గెంతుతూ ఉత్సాహపరిచింది. ఈ దృశ్యాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. – ఆత్మకూరు:



సింగంపల్లిలో చెట్టుపై వాలిన నెమలి

కూలిన ప్రహరీ - చిన్నారి మృతి

తాడిమర్రి: ఇంటి ప్రహరీ కూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ చిన్నారి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.... తాడిమర్రి మండలం మోదుగులకుంట గ్రామానికి చెందిన మాజీ డీలర్ మారక శివానందరెడ్డి, రజినీ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు పార్థసారథిరెడ్డి (3) గురువారం సాయంత్రం 5 గంటలకు ఇంటి వ్ద ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్టు కింద ఆడుకుంటూ ఉన్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు బలహీనపడిన ప్రహరీ ఉన్నఫలంగా బాలుడిపై కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు ఆగమేఘాలపై శిథిలాలు తొలగించి, తీవ్రంగా గాయపడిన చిన్నారిని స్థానిక ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుడి సూచన మేరకు బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమార్తెల తర్వాత కుమారుడు జన్మించడంతో ఎంతో అల్లారుముద్దుగా చూసుకునేవారమంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అక్కడున్నవారిని కంటితడి పెట్టించింది. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్‌లో శివానందరెడ్డిని పరామర్శించి ఓదార్చారు.

ఘనంగా సత్యసాయి రథయాత్ర



నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి రూరల్: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన భక్తులు గురువారం సత్యసాయి రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ కూడలి వద్ద బాబా చిత్రపటాన్ని ఉంచిన రథానికి ఆర్‌జే రత్నాకర్‌రాజు దంపతులు పూజలు చేసి, నగర సంకీర్తనను ప్రారంభించారు.

క్లుప్తంగా

సకాలంలో పంటలు సాగు చేసుకోండి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ, ప్రజాప్రతినిధులు

కనగానపల్లి: రైతులు సీజన్‌ను బట్టి సకాలంలో పంటలు సాగుచేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి క్రిష్ణకుమారి తెలిపారు. మండలంలోని తగరకుంట గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడులను వ్యవసాయాధికారులు పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈసారి పంట దిగుబడులు చాలా తగ్గాయని రైతులు తెలిపారు. ఈ నెల నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుందని.. రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై వ్యవసాయ రాయితీలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరాజులు, వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు రాజ్‌కుమార్, బొమ్మయ్య పాల్గొన్నారు.

'వారిద్దరూ తోడు దొంగలు'

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు ఇద్దరూ తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు మీదుగుల రామాంజనేయులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఈఓ, ఏపీసీ సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారుల పోస్టుల నియామకాల్లో అక్రమాలకు పాల్పడుతునారని ఆరోపించారు. పైకి మాత్రం ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నట్లు నటిస్తున్నారని.. అక్రమ ఆదాయం కోసం లోలోపు ఇద్దరూ ఒక్కటయ్యారన్నారు. వీరికి మధ్యవర్తిగా డీఈఓ కార్యాలయంలో పని చేస్తున్న టీచర్ వ్యవహరిస్తున్నారన్నారు. టీచర్‌ను అక్కడ నుంచి తప్పించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రమోషన్లలో రూ.లక్షల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరారు. ఇటీవల సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి రిలీవైన కొందరి టీచర్ల నుంచి రూ.లక్షలు తీసుకున్నట్లు చర్చ సాగుతోందన్నారు. అవకతవకలకు పాల్పడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీని ఆయా పోస్టుల నుంచి తొలిగించాలన్నారు. ఉన్నత అధికారులతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అనర్హులకు అవకాశం కల్పిస్తూ ప్రస్తుతం నిర్వహించిన ఇంటర్వ్యూలను రద్దు చేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే జీవితాలు నాశనమవుతాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. కళాశాల అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో గురువారం 'మాదక ద్రవ్య వినియోగం–రవాణా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి వినియోగం వల్ల ఆరోగ్యం ఎలా క్షీణిస్తుంది? యువత బంగారు భవిష్యత్తు ఏ విధంగా నాశనం అవుతుందో జిల్లా హెల్త్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం జోలికి పోకుండా యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.బాలాజీ నాయక్, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పీఎస్ లక్ష్మీ, డాక్టర్ జి.చలపతి, డాక్టర్ బి.రామచంద్ర, డాక్టర్ ఎస్.వెంకటనారాయణ పాల్గొన్నారు.

బస్సుపాసుల మంజూరులో సాంకేతిక లోపం

అనంతపురం క్రైం: సాంకేతిక లోపం వల్ల ఈనెల 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఆర్టీసీలోని అన్ని రకాల బస్సు పాసుల మంజూరు నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ కౌంటర్ ఈనెల 7వ తేదీ నుంచి పని చేస్తుందన్నారు. విద్యార్థులు, దివ్యాంగులతో పాటు అన్ని రకాల పాసులు పొందాలనుకునే వారు ఈనెల 7వ తేది నుంచి పాసులను కౌంటర్‌లో పొందవచ్చని తెలిపారు.

అరటి సాగుపై శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో గురువారం అరటి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అరటి సాగులో అధిక దిగుబడులకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అంశాలపై అధికారులు, కంపెనీ ప్రతినిధులుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డితో పాటు అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప, నంద్యాలకు చెందిన పలువురు ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఏపీఎంపీ అధికారులతో కలిసి రూరల్ మండలంలో అరటి, ద్రాక్ష, దానిమ్మ తోటలను పరిశీలించారు.



బాలింతల వార్డులో సేదతీరుతున్న ఓ వ్యక్తి, పక్కనే బాలింతలు ఉన్న దృశ్యం



గైనిక్ వార్డులో కూర్చున్న పురుషులు

అయ్యో.. బాలింతలు

రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు వారి భద్రతకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. గర్భిణులు, బాలింతలు, మహిళలుంటే గైనిక్, లేబర్, అంటినేటల్, ఎఫ్ఎం, ఎఫ్ఎస్, తదితర వార్డుల్లో మగవారు తిష్ట వేస్తున్నారు. బాలింతలు ఉండే వార్డుల్లో మరీ దారుణమైన పరిస్థితి కనిపిస్తోంది. ఓ వైపు తల్లి పురిటి బిడ్డలకు పాలిస్తుంటే.. మరో వైపు పక్క మంచంలో మగవారు పడుకుని కాలక్షేపం చేస్తున్నారు. దీన్ని చూస్తున్న సెక్యూరిటీ కానీ, స్టాఫ్‌నర్సులు కానీ నోరు మెదపడం లేదు. తమకేం పట్టదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. వాస్తవంగా మహిళలు ఉండే వార్డుల్లోకి మగవారిని అనుమతించినా.. ఎక్కువ సేపు వార్డుల్లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలి. కానీ జీజీహెచ్‌లో అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పాటుగా జీజీహెచ్‌లో అధిక సంఖ్యలో గర్భిణులు అడ్మిట్ కావడంతో పడకల కొరత ఏర్పడింది. ఒకే మంచంపై ముగ్గురు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నవమాసాలు బిడ్డను మోసి ప్రసవించాక ఆ తల్లి కొన్ని రోజుల పాటు పడే ఇబ్బందులు చెప్పలేని పరిస్థితి. అటువంటిది ఆ తల్లులకు ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురుని పడుకోబెడుతుండటంతో బాలింతల కష్టాలు వర్ణనాతీతం. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సొంత ఇలాకాలోనే ఇటువంటి దయనీయమైన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా సర్వజనాస్పత్రి అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి. – అనంతపురం మెడికల్:



రెండు మంచాలపై ముగ్గురు బాలింతలు పడుకున్న దృశ్యం

కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రైవేటీకరణ



నిరసన దీక్ష చేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిద్ధపడిందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్పయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం (సీపీఐ), ఏపీ రైతు సంఘం (సీపీఎం) ప్రధాన కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల బతుకులతో చెలగాటం ఆడుతోందన్నారు. వారి సంక్షేమం, శ్రేయస్సును విస్మరించి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఒక పథకం ప్రకారం ముందుకు వెళుతోందని తెలిపారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. లాభాల్లో ఉన్న సంస్థలను నష్టాల బాట పట్టించేలా చేస్తోందన్నారు. ఇదే క్రమంలో ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధపడిందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కానివ్వబోమంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రకటించిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడు ఎక్కడికి పోయాయని నిలదీశారు. కేంద్రంతో మాట్లాడి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలపై కూటమి నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, పోరాట సమన్వయం సమితి సభ్యులు బాలరంగయ్య, రాయుడు, నాగేష్, వెంకటరాముడు, బండి వెంకటరాముడు, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



కలశపూజలతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు వేదపండితులు అంకురార్పణ చేశారు. గురువారం గణపతి హోమం, యాగమండప ప్రవేశం, ధ్వజారోహణంతో పదిరోజుల పాటూ సాగే శ్రీవారి బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారికి పంచామృతాభిషేక సహిత అలంకార సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఉభయదేవేరులతో కలిసి శ్రీవేంకటేశ్వరుడు పురవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చాడు. ఆదిశేషుడి వాహనంపై ఆలయ రథం సాగుతున్నప్పుడు దారిపొడుగునా భక్తులు హారుతలు పట్టి నీరాజనాలర్పించారు. కళాకారులు చెక్కభజన, కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, అర్చకులు ఏఎల్ఎన్ హరికిషోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: ఎస్కేయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.నరసింహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసెట్–2024లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలన్నారు. ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్లు పొందే అభ్యర్థులు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ఆత్మకూరు: గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా వెంటనే పంచాయతీ సెక్రటరీలకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అంతేకాకుండా గ్రామాల అభివృద్ధికి అందరూ కలసి ముందుకు సాగాలన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశమయ్యారు. పారిశుధ్య కార్యదర్శుల పనితీరుపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణ పక్కాగా జరగడం లేదన్నారు. ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు చెత్త తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేకువజామున క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కాలువలు శుభ్రం చేయించాలన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించే వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే అపరాద రుసుంతో పాటు షాపులను సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించాలన్నారు. ప్రజలు సైతం ప్లాస్టిక్‌ను వాడకుండా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. నగరంలోని వివిధ డివిజన్లలో కుక్కలు ఎన్ని ఉన్నాయో నమోదు చేయాలన్నారు. త్వరలోనే కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ మొదలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. సకాలంలో ఆవులను తరలించకపోతే గోశాలకు పంపాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిను ఆయన ఆదేశించారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవని సచివాలయ శానిటేషన్ కార్యదర్శులను హెచ్చరించారు.

దంచికొట్టిన వర్షం



అశోక్ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

అనంతపురంలో గురువారం రాత్రి జోరువాన కురిసింది. 9 గంటలకు ప్రారంభమైన వర్షం.. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసింది. పలు కాలనీల్లో మురుగు రోడ్లపై ప్రవహించింది. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



వర్షంలో ప్రజల రాకపోకలు



నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం

ఆత్మకూరు ఎంపీడీఓగా లక్ష్మీనరసింహ స్వామి



ఆత్మకూరు: మండల నూతన ఎంపీడీఓగా లక్ష్మీనరసింహ స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కుందుర్పి ఎంపీడీఓగా విధులు నిర్వరిస్తూ బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం సీఎస్ఆర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'బెస్ట్ ప్రోగ్రాం ఇన్ ప్రీమియర్ బ్యాంకర్' అనే అంశంపై ఇన్ఫోసిస్, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులు సాంకేతిక నైపుణ్యత సాధిస్తారన్నారు. తద్వారా ఉద్యోగాల కల్పన సులభతరం అవుతుందన్నారు. ఐసీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. దినకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. తమ సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా 48 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. రాయలసీమలో మొట్టమొదటి సారిగా ఈ కళాశాలలో చేపట్టామన్నారు. బీకామ్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రోగ్రాం ఇన్ ప్రీమియర్ బ్యాంకర్ అనే అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ ఆనంద రావ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అరుంధతి, డైరెక్టర్ యూవీ రామి రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ జి.మల్లి రెడ్డి, ఐసీటీ రాయలసీమ రీజినల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు వీడ్కోలు

ఆత్మకూరు: ఈఓఆర్డీ దామోదర్ రెడ్డి వజ్రకరూరుకు, జూనియర్ అసిస్టెంట్ వాణి అనంతపురం రూరల్‌కు బదిలీ అయ్యారు. గురువారం వీరిని ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ప్రజలు, ఉద్యోగుల సహకారం ఎప్పటికి మరువలేమని ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి, ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తారా?



తరగతులు బహిష్కరించి విద్యార్థులను బయటకు పంపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దసరా సెలవులు వదలాలని చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలను ప్రైవేట్ విద్యా సంస్థలు తుంగలో తొక్కాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థలు సెలవు దినాల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారంటూ మండిపడ్డారు. గురువారం నగరంలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వెళ్లి ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన హనుమంత రాయుడు, కుళ్లాయి స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3 నుంచి 13 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిందన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేయకుండా నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యనాలు సెలవు దినాలలో కూడా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. తరగతులు నిర్వహణపై యాజమాన్యాలను ప్రశ్నిస్తే ఆర్ఓఐ నుంచి ఎలాంటి లెటర్ రాలేదని చెబుతున్నారన్నారు. ఆర్ఐఓ వెంకట రమణను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు మంజునాథ్, నాయకులు పవన్, కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.



శరన్నవరాత్రుల శోభ



మొదటి రోడ్డు శివాలయంలో పూజలందుకున్న శారదా మాత



ఆత్మకూరులో స్వర్ణకవచ అలంకరణలో వాసవీ మాత



హెచ్చెల్సీ కాలనీలో రాజరాజేశ్వరీ అలంకరణలో ముత్యాలమ్మ



రాప్తాడు: బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో దుర్గాదేవి



ఆత్మకూరులో దుర్గామాత వేషధారణలో బాలికలు



పాతూరు అమ్మవారి శాలలో నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్/ఆత్మకూరు/రాప్తాడు: దసరా శరన్నవరాత్రులు గురువారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాడవాడలా అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. ప్రధానంగా అనంతపురంలోని కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆలయ అధికారి రమేష్‌బాబు ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం హంస వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. రెండవ రోడ్డులోని శ్రీచంద్రశేఖరేంద్ర పీఠంలో మధుసూదనరావు నేతృత్వంలో దసరా ఉత్సవాలను హోమాలతో శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. బాలయోగి ఆశ్రమం, ఐదవ రోడ్డులోని నల్లమల సుంకులమ్మ తల్లి, సున్నంగేరు, ఎల్బీ నగర్‌లోని రేణుకా యల్లమ్మ తల్లి, హెచ్చెల్సీ కాలనీ నసనకోట ముత్యాలమ్మ, శివకోటి, శంకర మఠం తదితర చోట్ల అమ్మవారు అలంకార సేవల్లో ప్రత్యేక పూజలందుకున్నారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని శ్రీ గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు గురువారం బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందిరమ్మ కాలనీలో దుర్గాదేవి బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో పూజలందుకున్నారు. రాప్తాడు శివాలయంలో పార్వతి దేవి, పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. వాసవీ మాత స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వడ్డుపల్లిలోని సుంకులమ్మ దేవతకు పూజలు నిర్వహించి మహా మంగళ హారతి అందించారు. ఆత్మకూరు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బాలికలు నవదుర్గ వేషధారణలో ఆకట్టుకున్నాయి.



అలంకరణలో ఐదవ రోడ్డులోని నల్లమల సుంకులమ్మ తల్లి

